క్లుప్తంగా

వాసవీ సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం



వినుకొండ(నూజెండ్ల): శ్రీ వాసవి అన్నదాన సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో 500మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ ఇంటర్ నేషనల్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ తవ్వా నాగమల్లేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రతి నెల 9వ తేదీన సేవా సంస్థ వారు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఖజ్జాయం విజయలక్ష్మి, కోటీశ్వరరావు, పవన్‌కిరణ్, అంకమ్మరావు, ఆంజనేయులు, రవికుమార్, సాంబశివరావు, కృష్ణ, శైలజ, శారద, ఠాగూర్, ప్రసాద్, శ్రీనివాసరావు, అప్పలరాజు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి మృతి



రవీంద్రబాబు మృతదేహం

నాదెండ్ల: దంపతుల మధ్య మనస్పర్థలతో భర్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కనపర్రులో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మర్రి రవీంద్రబాబు(29) తాపీ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తుంటాడు. కొంతకాలంగా భార్యతో మనస్పర్థలతో తరచూ దంపతుల మధ్య ఘర్షణ జరుగుతుండేది. ఈ క్రమంలో ఉదయం పనికి వెళ్లి మధ్యాహ్నం 2 గంటలకు ఇంటికి తిరిగి వచ్చాడు. సాయంత్రం 4 గంటల సమయంలో ఇంట్లో ఉరేసుకుని ఉండటాన్ని భార్య గమనించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆయుష్మాన్ భారత్ ఖాతా ఆన్‌లైన్ పురోగతి పెంచాలి

శావల్యాపురం: ఆయుష్మాన్ భారత్ డిజిటల్ ఖాతా నంబరు(అభ) నమోదు పురోగతి నూరు శాతం అయ్యేలా క్షేత్రస్థాయిలో వైద్య ఆరోగ్య సిబ్బంది కీలకపాత్ర పోషించాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి గ్రామసచివాలయంలోని ఆరోగ్య కార్యకర్త ద్వారా ఆన్‌లైన్ నమోదు చేస్తారన్నారు. ఆధార్‌కు ఫోన్ నంబరు లింకు అయిన వారందరు అర్హత పొందుతారన్నారు. మండలంలో 77 శాతం నమోదు అయినట్లు చెప్పారు. ఆయనతో పాటు స్టాఫ్‌నర్సులు లక్ష్మీప్రసన్న, ధనలక్ష్మి, ప్రమీల ఉన్నారు.

లోక్‌అదాలత్‌ను జయప్రదం చేయండి

నరసరావుపేట టౌన్: జాతీయ లోక్‌అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యే దిశగా కృషి చేయాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్.ఆశీర్వాదంపాల్ అన్నారు. కోర్టు ప్రాంగణంలో పోలీస్ అధికారులతో సమావేశం మంగళవారం నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులతో పాటు సివిల్ కేసులు పరిష్కరించబడతాయన్నారు. నరసరావుపేట రూరల్, ఫిరంగిపురం, నకరికల్లు ఎస్ఐలు నాగిరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

ఆదర్శపాఠశాల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నకరికల్లు: మండలంలోని దేచవరం గ్రామంలో గల ఆదర్శపాఠశాలలో 2023–24కు గాను ఆరోతరగతిలో ప్రవేశానికి ఈనెల 9వతేదీ నుంచి 25వతేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ వేళాంగిణి మేరీ మంగళవారం తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఏపీఎంఎస్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జూన్ 11వతేదీన ఉదయం 10 నుంచి 12 గంటల వరకు దేచవరంలోని ఆదర్శపాఠశాలలోనే రాతపరీక్ష నిర్వహిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు పరీక్షఫీజు రూ.75లు, ఓసి, బీసిలకు రూ.150 లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు పాఠశాలలో సంప్రదించవచ్చన్నారు.

శివాలయానికి ఎకరం భూమి వితరణ

తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి గ్రామాలయంలో పునర్మితమైన శివాలయానికి రాజుపాలెం మండలం గణపవరం గ్రామానికి చెందిన వ్యాపారవేత్త నరిశేటి తాండవకృష్ణ, సుభాషిణిల దంపతులు ఎకరం భూమిని వితరణగా అందించారు. తాండవకృష్ణ స్వర్గస్తులైన తన తల్లిదండ్రులు నరిశేటి గురవయ్య, లక్ష్మీనరసమ్మల జ్ఞాపకార్థం శివాలయం నిర్వహణకు గాను భూమి హక్కు పత్రాలను అందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ ప్రతిష్ట లో భాగంగా నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి గాను రూ.10వేలు ఆర్థిక సాయాన్ని శివాలయం కమిటీ సభ్యులైన రాయిడిపూర్ణయ్య, శేషయ్య లకు అందించారు.

పారదర్శకంగా ప్రభుత్వ పథకాల అమలు

- మంత్రి విడదల రజిని
- ప్రతి కుటుంబానికి ఆర్థిక లబ్ధి
- మురికిపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి వైపు అడుగులు వేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మండలంలోని మురికిపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మంత్రి విడదల రజిని ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరు వివరిస్తూ, ఏ ఇంటికి ఏ పథకం ద్వారా లబ్ధి చేకూరిందో వివరించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి కుటుంబం బాగుపడేలా సంక్షేమ పథకాలను కులం, ప్రాంతం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం అందజేస్తోందని వివరించారు. సామాజిక తనిఖీల ద్వారా లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి వారికి ఆయా పథకాలను అందజేస్తున్నదని వివరించారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతోందని చెప్పారు. ప్రజల కష్టాలు తెలిసిన నేత ముఖ్యమంత్రిగా ఉండటం రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమని పేర్కొన్నారు. వార్డు, గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అవినీతికి ఆస్కారం లేని విధంగా పథకాలను అమలు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించటమే లక్ష్యంగా గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, గ్రామ సర్పంచి ఉసర్తి భూలక్ష్మి, ఉప సర్పంచి కొమ్మనబోయిన రామకృష్ణరాజు, వైస్ ఎంపీపీ సూరబోయిన ఆదిలక్ష్మి, మురికిపూడి పీఏసీఎస్ అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటశివ, ఎంపీటీసీ సభ్యులు జమ్మలమడక సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కొమ్మనబోయిన హరికృష్ణ, నాయకులు ఉసర్తి రాంబాబు,కొమ్మనబోయిన చెంచురాములు, బోడి సాంబయ్య, గోగు ముక్కంటి, దాసరి హనుమంతరావు, జాష్టి సూరయ్య పాల్గొన్నారు.

జవాబుదారీతనం కోసమే 'జగనన్నకు చెబుదాం'

ఎంపీపీ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్



రొంపిచర్ల కార్యాలయంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు ఓబుల్‌రెడ్డి

యడ్లపాడు: అధికారుల్లో జవాబుదారీతనం కోసమే 'జగనన్నకు చెబుదాం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎంపీపీ పిడతల రూనీస్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని మరింత విస్తతం చేసే దిశలో భాగంగా జగనన్నకు చెబుదాం పేరిటా ఏర్పాటు చేసిన ప్రతిష్టాత్మక కార్యక్రమం మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా స్థాని క మండల పరిషత్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఘంటా శంకర్, ఎంపీడీఓ వై.హనుమారెడ్డి, ఏఓ సాయి శ్రీనివాస్, ఉపాధి హామీ పథకం టీఏ మాధవి పాల్గొన్నారు.

ముప్పాళ్లలో..

ఈపూరు: మండలంలోని ముప్పాళ్ల గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నాయకులు, రైతులతో కలసి వినుకొండ వ్యవసాయ శాఖ ఏడీఏ బి.రవిబాబు వీక్షించారు. అనంతరం రైతులతో ఏడీఏ రవిబాబు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రంలో పలు రకాల విత్తనాలైన పచ్చిరొట్ట పైర్ల విత్తనాలు, పత్తి, మిరప విత్తనాలను అందుబాటులో ఉంటాయని, కావాల్సిన రైతులందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొక్కజొన్న పంట పండించిన రైతులందరూ ఆర్‌బీకేల్లో వారి పేర్లను నమోదు చేయించుకోవాలని, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో పంటను విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఈపూరు సొసైటీ చైర్మన్ బొల్లా వెంకటరాధాకృష్ణ (బుజ్జి), గ్రామ వ్యవసాయ సహాయకురాలు రాచకొండ శివగాయత్రి పాల్గొన్నారు.

నాదెండ్ల: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో సీఎం ప్రసంగాన్ని ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ మస్తాన్‌రావు, తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుసేన్, సీడీపీఓ శాంతకుమారి, డీటీ అనూరాధ పాల్గొన్నారు.

రొంపిచర్ల: అర్హులైన వారందరికీ సత్వరమే సేవలందించడమే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని జెడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందడంలో ప్రజలకు అవసరమైన ఇతర సమస్యలను పరిష్కరించటంలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా పరిష్కరించుకోవచ్చు అన్నారు. ఎంపీపీ గడ్డం వెంకట్రావు మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 1902 నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలు తెలియపరుచుకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్‌ల సంఘం అధ్యక్షుడు గాదె రామిరెడ్డి, ఎంపీటీసీలు దుద్దుకుంట యోగిరెడ్డి, తెలగనేని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా కార్యవర్గం ఎంపిక



చిలకలూరిపేట: అసోసియేటెడ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ సమావేశాన్ని పట్టణంలోని ఎన్‌టీఆర్ కాలనీలో ఉన్న కర్మేల్ చర్చిలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏఐసీసీ జాతీయ కోశాధికారి సిస్టర్ జి.కీర్తన పాల్గొన్నారు. పల్నాడు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా పట్టణానికి చెందిన రెవరెండ్ డాక్టర్ ఎంవీఎల్ఎస్ పావని, గౌరవ అధ్యక్షుడిగా బి.ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా పాస్టర్ జాన్‌పాల్, పి.విజయబాబు, చిలకలూరిపేట మండల అధ్యక్షుడిగా చేబ్రోలు మాణిక్యరావు, మహిళా అధ్యక్షురాలిగా సిస్టర్ సునితలను ఎంపిక చేశారు. సంఘ కార్యక్రమాల గురించి సిస్టర్ జి.కీర్తన వివరించారు. కార్యక్రమంలో రెవరెండ్ బి.ప్రవీణ్‌కుమార్, పాస్టర్ జాన్‌పాల్ పాల్గొన్నారు.

భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలి



నాదెండ్ల: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలని జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, ఎంపీపీ తలతోటి రాణి చెప్పారు. తూబాడులోని ఎంపీపీ రాణి నివాసంలో ఉత్తమ ఫలితాలు సాధించిన తూబాడు, చిరుమామిళ్ల జెడ్పీ హైస్కూలు, ఏపీ మోడల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు తులసీ, పావని రాజేశ్వరి, మాలె శ్రీనివాసరావు, ఎస్.ప్రసన్నలక్ష్మి, నిఖిల్, ప్రేమరోశన్, షేక్ సైఫుల్లా, అజయ్‌లను శాలువాలతో సత్కరించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులను అభినందించారు. సర్పంచి గోళ్లమూడి కాశయ్య, ఎంపీడీఓ జాకీర్‌హుసేన్, ఎంఈఓ ఆంజనేయులు, నాదెండ్ల సొసైటీ చైర్మన్ మద్దూరి కోటిరెడ్డి, కోఆప్షన్ మెంబర్ మూసా, వైఎస్సార్ సీపీ నాయకులు మద్దూరి కోటిరెడ్డి, బత్తుల సీతారామిరెడ్డి, పెరుమాళ్ళపల్లి వెంకటేశ్వర్లు, చేరెడ్డి అంకిరెడ్డి, సింగారెడ్డి కోటిరెడ్డి, రత్తయ్య పాల్గొన్నారు.

13న ఉపాధి సామాజిక ప్రజావేదిక

శావల్యాపురం: జాతీయ ఉపాధి పథకం సామాజిక ప్రజావేదిక ఈనెల 13వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.సీతారామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. తనిఖీ బృందాలు గ్రామాల్లో చేపట్టిన నిధులపై చర్య ఉంటుందని వివరించారు.

నేడు పాలిసెట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



గణపవరం సీఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ రమాదేవి

నాదెండ్ల: రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నిర్వహించనున్న పాలిసెట్ 2023 ప్రవేశ పరీక్షకు నియోజకవర్గంలో ఆరు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా కోఆర్డినేటర్ రమాదేవి చెప్పారు. గణపవరం సీఆర్ డిగ్రీ కళాశాలను పరిశీలించి ఏర్పాట్లపై సమీక్షించారు. ఆమెతో పాటూ చిలకలూరిపేట కోఆర్డినేటర్ డేవిడ్‌రాజు, జిల్లా అబ్జర్వర్ మస్తానయ్య, చిలకలూరిపేట అబ్జర్వర్ విజయభాస్కర్, రూట్ ఆఫీసర్ సీహెచ్ రామన్న అసిస్టెంట్ కోఆర్డినేటర్ లక్ష్మీరాజ్యంతో ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ, సీఆర్ డిగ్రీ కళాశాలలో 400 మంది, ఏఎంజీలో 400, శారద హైస్కూలులో 350, ఆర్‌వీఎస్ హైస్కూలులో 350, మోడరన్ గ్రీన్ వ్యాలీలో 193, చైతన్యలో 166 మంది మొత్తం 1859 మంది పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. అభ్యర్థులు 9.45 గంటలకే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాలని సూచించారు. 11 గంటల నుండి ఒంటి గంట వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. ఇప్పటికే చాలా మంది అభ్యర్థులు హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్నారని, డౌన్‌లోడ్ కాకుంటే అభ్యర్థులు దరఖాస్తు ఫారం జిరాక్సులు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్ జిరాక్సుతో 9 గంటలకే పరీక్ష కేంద్రం వద్ద ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.100, ఓసీ, బీసీ అభ్యర్థులకు రూ.400 చెల్లించినట్లయితే హాల్‌టికెట్లు అందిస్తామన్నారు. 11 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలో అనుమతి లేదన్నారు.

రేషన్‌దుకాణాలపై విజిలెన్స్ దాడులు



బియ్యం నిల్వలు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

అమరావతి: మండల కేంద్రమైన అమరావతిలో రేషన్ దుకాణాలపై మంగళవారం విజిలెన్స్ సీఐ శ్రీహరిరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో రేషన్ షాప్‌నంబరు 43లో సుమారు 120 బస్తాలు అనగా 6113 కేజీల బియ్యం నిల్వలు మాయమైనట్లు గుర్తించారు. అలాగే షాప్‌నం.2లో 117కేజీల బియ్యం నిల్వలేనట్లుగా గుర్తించారు. ఈసందర్భంగా విజిలెన్స్ సీఐ శ్రీహరిరావు మాట్లాడుతూ షాప్‌నం.43లో రేషన్‌డీలర్ మాధవి, ఎండిఎం ఆపరేటర్ ఆదాంపైన అలాగే షాప్‌నం.2లో గుడిసె ముక్కంటిపైన పేదలకు పంచాల్సిన బియ్యాన్ని మాయం చేసినందుకు క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నామని అలాగే నిత్యావసరాల చట్టం కింది కేసు నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్‌కు సిపార్సు చేస్తున్నామని తెలిపారు. ఈదాడుల్లో ఇన్‌చార్జీ అర్ఐ రాజశేఖర్, వీఆర్ఓ మురళి తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ తనిఖీల్లో రేషన్ షాపు సీజ్

నాగవరం(క్రోసూరు): మండలంలోని నాగవరం గ్రామంలో సివిల్‌సప్లయ్ విజిలెన్స్ అధికారులు సోమవారం రేషన్‌షాపులు తనిఖీ నిర్వహించారు. అందులోభాగంగా ఆవుల వెంకటేశ్వర్లు(సాయి) నిర్వహిస్తున్న రేషన్‌షాపు సీజ్ చేసారు. షాపులో పీడీఎస్ బియ్యం 2595 కిలోలు ఉండాల్సి ఉండగా తనిఖీ సమయంలో కేవలం 300 కిలోలు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. షాపుసీజ్ చేసి గ్రామ వీఆర్వో భానుచందర్ కు బాధ్యతలు అప్పగించడం జరిగింది. ఈదాడుల్లో విజిలెన్స్ సీఐ లక్ష్మారెడ్డి, ఏఎస్ఓ రోషన్, సిబ్బంది, మండల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పెదకూరపాడు: వైద్య ఆరోగ్య శాఖ విలేజ్ హెల్త్ క్లీనిక్‌లో సీహెచ్‌ఓలుగా పనిచేస్తున్న సిబ్బంది బుధవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావును కలిసి సమస్యల పరిష్కరించాలంటూ అర్జీ ఇచ్చారు. నేషనల్ హెల్త్ మిషన్ కింద పనిచేస్తున్న సిబ్బందికి రూ. 25 వేలు వేతనంతోపాటు, రూ. 15 వేలు ఇన్‌సెంటీవ్ వస్తోందని, ఇన్‌సెంటీవ్ చెల్లించడం లేదని, వెంటనే చెల్లించేలా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న వీరిని క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. సమస్య విన్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు.

మినీ జాబ్ మేళాలో 42 మందికి ఉద్యోగాలు

నరసరావుపేట ఈస్ట్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 42 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు సంస్థ జిల్లా అధికారి పి.ప్రణయ్ తెలిపారు. ఎస్ఎస్‌పీ కాలనీ కలెక్టర్ కార్యాలయం వద్ద ఉన్న ఎస్‌ఏసీ ట్రైనీ సెంటర్‌లో నిర్వహించిన మినీ జాబ్‌మేళాకు 145 మంది హాజరయ్యారని తెలిపారు. వల్లభ మిల్క్ డెయిరీ, గ్రీన్ టెక్ ఇండ్రస్టీస్ ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు, అపోలో ఫార్మసీ, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థల హెచ్‌ఆర్ ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నట్లు వివరించారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

బొల్లాపల్లి: మండలంలోని బ్రిడ్జితండాలో పోలేరమ్మ తల్లి తిరునాళ్లను పురస్కరించుకొని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తనయుడు, వైఎస్సార్ సీపీ యువ నాయకులు బొల్లా గిరిబాబు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు బొల్లా గిరిబాబుకు ఘన స్వాగతం పలికి సత్కరించారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో పేదల ఇంటికే వైద్యం



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంఓ రవీంద్రరత్నాకర్

శావల్యాపురం: గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మెరుగైన వైద్యం సకాలంలో అందేలా ప్రభుత్వం ఫ్యామి లీ డాక్టర్ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం అన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామ సచివాలయం-1 పరిధిలో ఆరోగ్య ఉప కేంద్రంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వేసవిలో ఉష్ణోగ్రత తీవ్రత నుంచి వడ దెబ్బకు గురికాకుండా ఉండేందుకు వైద్యులు సలహాలు సూచనలు తప్పనిసరిగా అందరు పాటించాలని కోరారు. 60 మంది రోగులకు పరీక్షలు నిర్వహించిన అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగుల ఇంటికి నేరుగా వెళ్లి వారి ఆరోగ్య స్థితిగతులను పరిశీలించి తగు సూచనలు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌ఓ శ్యామలత, ఆరోగ్య కార్యకర్త విజయమ్మ పాల్గొన్నారు.

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఓ రవీంద్రరత్నాకర్ హాజరయ్యారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసే బాధ్యత అందరిపై ఉందన్నారు. విలేజ్ హెల్త్ ప్రొఫైల్, ఎన్‌సీడీ సర్వేపై టెలికాన్ఫిరెన్స్ నిర్వహించారు. రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మురళీధర్, హెల్త్‌సూపర్‌వైజర్ కె.అబ్దుల్ రెహమాన్, హెల్త్ అసిస్టెంట్ మీరా, ఏఎన్ఎం సుందరమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ శిరీష పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్‌పై రైతులకు అవగాహన



కొత్తలూరు రైతుభరోసా కేంద్రంలో మాట్లాడుతున్న ఏఓ రామారావు

శావల్యాపురం: రానున్న ఖరీఫ్ సీజనుకు రైతులకు అవసరమైన విత్తనాలు ఎరువులు, కొరత లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు అన్నారు. మంగళవారం ఖరీఫ్ సీజను సమాయాత్తం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పొట్లూరు, కొత్తలూరు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పచ్చిరొట్టె ఎరువులు జీలుగ, జనుము, పిల్లిపెసర తదితరవన్నీ రాయితీపై ఇస్తున్నట్లు చెప్పారు. మట్టినమూనా పరీక్షలు రైతులు చేయించటం భూమిలో పోషకాల శాతం అవగాహన ఉంటుందని చెప్పారు. సదస్సులో పశువైద్యాధికారి పి.గణేష్‌కుమార్, ఏఈఓ పురేటి అశోక, ఎంపీటీసీ దావులూరి సంపూర్ణ, వీఏఏలు ఓర్పు శ్రీనివాసరావు, శివానాయక్ పాల్గొన్నారు.

ముందస్తు ఖరీఫ్‌పై అవగాహన

ఈపూరు: స్థానిక రైతు భరోసా కేంద్రంలో ముందస్తు ఖరీఫ్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణ అధికారి బి.అప్పారావు మాట్లాడుతూ రైతులు రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న సేవలను వినియోగించుకోవాలని, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు మరియు పురుగు మందులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫీల్డ్ ఆఫీసర్ సీహెచ్ హనీమిరెడ్డి, చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ డి.రాజేష్, ఫీల్డ్ ఆఫీసర్ ఎ.రమణారావు, సర్పంచి పల్లమీసాల చెంచయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.శేషుబాబు, పంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలకు అనుగుణంగా పంటల సాగు



మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారి కిషోర్‌యాదవ్, పక్కన ఏఓ సరిత

యడ్లపాడు: రైతులు భూసార పరీక్షలకు అనుగుణంగా పంటలు మాత్రమే ఖరీఫ్ సీజన్‌లో సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి సీహెచ్ సరిత చెప్పారు. మండలంలోని ఉన్నవ గ్రామంలోని రైతుభరోసా కేంద్రంలో సాగుకు సమాయత్తం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఓ సరిత మాట్లాడుతూ రైతులు మూస విధానంలో పంటసాగు చేయడం తగదన్నారు. పంటమార్పిడి, పంట రకాల ఎంపిక, విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు పాటించాల్సిన అంశాలు, భూసార పరీక్షలకు మట్టి నమూనాల సేకరించే విధానం, పరీక్షలకు అనుగుణంగా పంటలను ఎంపిక, ఎరువులు, పచ్చిరొట్ట కలియదున్నడంపై అవగాహన కల్పించారు. ఉద్యానశాఖ అధికారి జీ కిషోర్ యాదవ్ మాట్లాడుతూ ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో అందించే వివిధ ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రస్తుతం డ్రిప్, స్పింక్లర్లపై 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఉపసర్పంచి చాగంటి శ్రీధర్ పాల్గొన్నారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న పల్నాడు జిల్లా ఉమెన్ ట్రాఫికింగ్ ఎస్ఐ గౌతమి

చిలకలూరిపేట టౌన్: మాయమాటలు చెప్పి మహిళల తల్లిదండ్రుల నమ్మించి వారిని ఇతర రాష్ట్రాలకు తీసుకెళ్లి అమ్మేస్తుంటారని అలాంటి వారితో అప్రమత్తంగా ఉండాలని పల్నాడు జిల్లా ఉమెన్ ట్రాఫికింగ్ ఎస్ఐ వి.గౌతమి చెప్పారు. మండలంలోని బొప్పూడి గ్రామంలో ఉమెన్ ట్రాఫికింగ్‌పై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అవగాహనాలేమి, పేదరికాన్ని ఆసరాగా చేసుకొని మహిళలను అక్రమ రవాణాకు పాల్పడతారని వివరించారు. మహిళల్లో చైతన్యం పెరిగితే ఇటువంటి వాటితో అప్రమత్తంగా వ్యవహరించవచ్చని తెలిపారు. అనుమానిత వ్యక్తుల సమాచారం పోలీసులకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవినేని శంకరరావు, సర్పంచి ఎస్‌కే రమేష్‌బాబు, నాదెండ్ల సీడీపీఓ శాంతకుమారి, ఏసీడీపీఓ నిర్మల, చైల్డ్‌లైన్ నోడల్ కోఆర్డినేటర్ బి.సుగ్నాన రాణి, సీహెచ్ అనూరాధారెడ్డి పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

శావల్యాపురం: ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్‌లో భాగంగా ప్రతి నెల 9వ తేదీన క్రమం తప్పకుండా గర్భిణులు వైద్య ఆరోగ్య పరీక్షలు చేయించాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వేముల వెంకట భాస్కర్ అన్నారు. మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహించారు.

రక్తహీనతపై అప్రమత్తంగా..

బొల్లాపల్లి: గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని వైద్యాధికారి వి.చిన్నసైదులు అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్‌లో భాగంగా గర్భిణులకు మంగళవారం పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతినెల 9న గర్భిణులకు వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. రక్తహీనత లోపం లేకుండా ఐరన్, క్యాల్షియం టాబ్లెట్స్ వాడాలని తెలిపారు. 7,8 వ నెలలో ప్రభుత్వం ద్వారా ఉచితంగా రక్తహీనత నివారణకు ఇంజక్షన్లు అందజేస్తామన్నారు.

నాదెండ్ల మండలంలో..

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన(పీఎం ఎస్ఎంఏ) కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, సాయిశ్వేత పాల్గొని ప్రతి గర్భిణి ప్రతినెలా క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకుని డాక్టర్ సూచనలను తప్పక పాటించాలన్నారు. మంచి పౌష్టిక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని కోరారు. సీజనల్‌గా తక్కువ ధరలకు లభించే తాజా పండ్లు, ఆకు కూరలు, కాయగూరలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పద్మావతి, రత్నరాజ్యం, ఎంపీహెచ్ఈఓలు టి.విజయరాజు, భూపతిరావు, ఆగ్నేశమ్మ, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు